
ప్రజాశక్తి
మంగళవారం 2 మే 2023
5
విజయనగరం



## బొబ్బిలిలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి నిరంత రాయంగా చిరుజల్లులతో వర్షం కురవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం చెరకు, మొక్కజొన్న, నువ్వులు పంటకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కురుస్తున్న వర్షం

# ఘనంగా మేడే వేడుకలు

**నగరంలో ప్రదర్శన ● కోలాటం, డప్పులతో కదం తొక్కిన కార్మికులు**




ప్రదర్శనలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మిక దీక్షాదినం మేడే వేడుకలు సోమవారం జిల్లా అంతటా ఘనంగా జరిగాయి. పలు కార్యాలయాలు, పరిశ్రమల వద్ద మేడే ప్రతీక అయిన ఎర్రజెండాను కార్మిక సంఘాల నాయకులు ఎగురవేశారు. విజయనగరంలో సిఐటియు ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. సిఐటి యు కార్యాలయం వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్ జెండా ఆవిష్కరించారు. డాబాతోట వద్ద సిఐటి యు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు, కోట జంక్షన్ వద్ద, మున్సిపల్ కార్యాలయం ఎదుట, ఎల్‌బిజి భవనం వద్ద సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి జెండాను ఆవిష్కరించారు. పువ్వాడ కలానీలు, ఎపి బెవరేజ్, ఎంఆర్ ఆసుపత్రి, ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం డాబా తోట నుంచి సిఐటియు ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి జంక్షన్, గంటస్తంబం, మూడుల్లంతర్లు మీదుగా కోట జంక్షన్ వరకు కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహిళల కోలాటం, డప్పు వాయిద్యాలతో మేడే స్ఫూర్తిని తెలియచేస్తూ ప్రదర్శన సాగింది.



యూనియన్ జెండాను ఎగురవేస్తున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్

ప్రదర్శన అగ్ర భాగంలో సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు, బి.రమణ, యుఎస్ రవికుమార్, యుటిఎఫ్ నాయకులు డి.రాము, రమేష్ చంద్ర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనకు ముందు మెడికల్ సేల్స్ రిప్రెంజెజిటివ్ లు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోట వద్ద జోరు వానలో నిర్వహించిన బహిరంగ సభలో సిఐటియు నాయకులు సురేష్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు ఫలితంగా వచ్చింది మే డే అన్నారు. నేడు అనుభవిస్తున్న హక్కులు, కార్మిక చట్టాలు నాటి కార్మికుల పోరాట ఫలితమేనన్నారు. అటువంటి కార్మిక హక్కులను, చట్టాలను చివరకు కార్మిక సంఘాలను లేకుండా చేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎ ప్రభుత్వ రంగ సంస్థలను నేడు అదాని లాంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, తపాలా, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్,స్టీల్ ప్లాంట్ వంటి సంస్థలను దోపిడీదార్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాల్సి ఉన్నా మోడీ చేయడం లేదన్నారు. దేశంలో కోటి మంది స్కీమ్ వర్కర్లు ఉన్నా వారికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేవన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి కోసం, కార్మిక హక్కులు సాధన కోసం. మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎపి మెడికల్ సేల్స్ రిప్రజంటటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యు ఎస్ రవికుమార్, సిఐటియు నగర కార్యదర్శి వి.రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు, తదితరులు మాట్లాడారు. అంతకు ముందు ఐద్వా నాయకులు, కళాకారులు పాడిన విప్లవ గీతాలు అలరించాయి.

**ప్రజాశక్తి కార్యాలయంలో**

ప్రజాశక్తి కార్యాలయం వద్ద మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. సీనియర్ సభ్యులు కె.కృష్ణమూర్తి జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికులు అనేక చట్టాలు, హక్కులు సాధించుకున్నారని అన్నారు. నేడు దేశంలో మోడీ పాలనలో ఆ హక్కులు,చట్టాలకు విఘాతం కలిగించే విధంగా బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రజల పక్షాన నిలబడే పత్రికగా కార్మిక, కర్షకులను ఐక్యం చేసి వారి హక్కులను కాపాడుకునే విధంగా కథనాలు రాసి వారికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ కె.రమేష్ నాయుడు, డెస్క్ ఇన్‌చార్జి పి. అప్పారావు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎపి ఎన్‌జిఒ కార్యాలయంలో..**

ఎన్‌జిఒ సంఘ భవనంలో మేడే వేడుకలు జరిగాయి. ఉద్యోగుల హక్కుల గురించి ఉద్యమించి ప్రాణాలర్పించిన నేతలను స్మరించుకుంటూ మే డే స్ఫూర్తి తో రాబోయే రోజులలో డిమాండ్ల సాధనకై ఉద్యమిస్తామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.మురళి, ఎ.సురేష్ అన్నారు. కార్యక్రమంలో పైడిరాజు, జిల్లా నాయకులు మూర్తి, కనకరాజు, శ్రీధర్ ,ఆడిట్ శ్రీను, గోపీనాథ్, గంగా ప్రసాద్ తదితరులు పాల్గన్నారు.

**దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడదాం**

మే డే స్ఫూర్తితో దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఎఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెహరా శంకరరావు, రెడ్డి నారాయణరావు పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా ఊటగెడ్డలో జరిగిన సభలో వారు మాట్లాడుతూ దేశ సంపదను కొద్ది మంది దోపిడీ దారుల చేతుల్లో పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు.కార్మిక హక్కులను రక్షించుకునేందుకు రానున్న రోజుల్లో దోపిడీ కి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని అన్నారు. మద్దిల అప్పలరాజు అధ్యక్షతన సభలో కార్మికులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు



జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న సిఐటియు నేత తమ్మినేని, తదితరులు

## కార్మికుల హక్కులపై దాడిని తిప్పికొట్టాలి

**వంగర:** కార్మిక హక్కులపై దాడిని తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలు స్థానిక మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఆయన జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం వల్ల దేశ ప్రజానీకానికి తీవ్రమైన హాని జరుగుతుందన్నారు. దేశ సంపదను ప్రధాని మోడీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా విభజించడం అన్యాయమన్నారు. ఇలాంటి అన్యాయాలను ఎదిరించేందుకు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రజల పక్షాన పోరాడేందుకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మజ్జి గణపతి, డి.రాంబాబు, సిఐటియు నాయకులు విశ్వనాథం, త్రినాథరావు, రూపవతి, కుమారి, మరియమ్మ వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న కార్మికులు, చిన్నారులు

# ఎట్టకేలకు రెండోసారి

*భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఎట్టకేలకు రెండోసారి శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం ఈనెల 3న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రానున్నారు. రూ.4,592 కోట్లతో తొలిదశ నిర్మాణ పనులు పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టనున్నారు. ఈమేరకు జిఎంఆర్ సంస్థతో ప్రభుత్వానికి ఒప్పందం కుదిరింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గతంలో చంద్రబాబు నాయుడు కూడా శంకుస్థాపన చేశారు. తాజాగా మరోసారి శంకుస్థాపన ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో సర్వత్రా చర్చసాగుతోంది.*



భోగాపురం ఎయిర్‌పోర్టు నమూనా చిత్రం

- రేపు భోగాపురం ఎయిర్‌పోర్టుకు సిఎం శంకుస్థాపన
- పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మాణం
- రూ.4,592కోట్లతో తొలిదశ పనులు
- మూడేళ్లలో పూర్తిచేసేలా జిఎంఆర్‌తో ఒప్పందం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విశాఖపట్నం ఎయిర్‌పోర్టు ఏటా 10 లక్షల మంది ప్యాసింజర్లకు సేవలందిస్తోంది. విశాఖపట్నం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. పారిశ్రామిక కేంద్రంగా మారింది. అనేక ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులు నిత్యం జరుగుతుంటాయి. పర్యాటక కేంద్రంగానూ దేశ, విదేశాలను ఆకర్షిస్తోంది. ఇటీవల రాజకీయ కేంద్రంగానూ మారింది. ఈ నేపథ్యంలో విశాఖ కేంద్రంగా విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా దేశీయ ఎయిర్‌పోర్టు. దీనికితోడు పూర్తిగా నౌకాదళ ఆధీనంలో నడుస్తోంది. దానికి ఆనుకుని భూమిలేదు. ఎయిర్‌పోర్టుకు ఆనుకుని అనేక పరిశ్రమలు ఉన్నాయి. పొల్యూషన్ ఎక్కువగానే ఉంది. ఇన్ని అవాంతరాల మధ్య విశాఖ ఎయిర్‌పోర్టును విస్తరించే అవకాశం లేకపోవడంతో విశాఖకు చేరువలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలు భావించాయి. ప్రత్యామ్నాయంగా భోగాపురం వద్ద విమానాశ్రయ ఏర్పాటుకు 2012లోనే అధ్యయనం మొదలైంది.

**భోగాపురంపై ఎందుకంత ప్రేమ**

వెనుకబడిన విజయనగరం జిల్లాను అభివృద్ధి చేసేందుకే భోగాపురంలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్నట్టు అప్పట్లో చంద్రబాబు, నేడు సిఎం వైఎస్ జగన్మోన్‌రెడ్డ ప్రభుత్వాలు చెబుతున్నాయి. వాస్తవానికి తొలుత విశాఖ ఉమ్మడి జిల్లా, నేటి అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, ఎస్.రాయవరం మండలాల్లో ఏర్పాటు చేసేందుకు భూములు పరిశీలించారు. ఆయా చోట్ల ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అంత అనువుగా లేదు. ఆ ప్రాంత వాసులు రైతులు, తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం భీమిలిలోనూ పరిశీలన చేశారు. అక్కడ బడా పెట్టుబడిదారులు పాతుకు పోవడంతో దృష్టి భోగాపురం వైపు మళ్లింది. అనేక అధ్యయనాల అనంతరం భోగాపురం మండలంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి నిర్ణయించారు. ఇందుకోసం 4 గ్రామాల్లోని 404 కుటుంబాలు భూమిని త్యాగం చేశాయి. ఎపి రైతు సంఘం, సిపిఎం తదితర ప్రజాసంఘాలు, పార్టీల పోరాటంతో మెరుగైన ప్యాకేజీ అందింది.

### 2015లో అంకుర్పారణ

2015లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలోనే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. అప్పట్లో 5,311 ఎకరాలు సేకరించేందుకు సిద్ధమైంది. సిపిఎం, ఎపి రైతు సంఘంతోపాటు పలు సంఘాలు, సంస్థలు రైతుల తరపున గళం విప్పాయి. స్థానికుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో 2,703 ఎకరాలకు తగ్గించారు. ఈ విస్తీర్ణంలో ఏరోసిటీ, మెయింటైనెన్స్, రిపేర్స్ అండ్ ఓవర్ హాల్ సౌకర్యం, ఏవియేషన్ అకాడమీతో కూడిన అంతర్జాతీయ ప్రమాణాల గల విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని చెప్పింది. తొలుత నిర్ణయించుకున్న ప్రకారం 2023నాటికి ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఈ మేరకు 2019 ఫిబ్రవరి 15న సాధారణ ఎన్నికలకు ముందు అప్పటి సిఎం నారా చంద్రబాబునాయుడు హడావుడిగా ఎయిర్‌పోర్టు శంకుస్థాపన చేశారు. కానీ, అప్పటికి భూసేకరణ పూర్తికాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి 500ఎకరాలను మినహాయించి 2,203 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించింది. నిన్న మొన్నటి వరకు నిర్వాసితులకు ప్యాకేజీలు చెల్లించలేదు. పునరావాస కల్పనకూ తీవ్ర జాప్యం వాటిల్లింది. దీంతో, తొలి దశ నిర్మాణాలు పూర్తికావాలని లక్ష్యంగా పెట్టుకున్న 2023నాటికి మరోసారి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తున్నారు. పనులు ప్రారంభించిన నాటి నుంచి గరిష్టంగా మూడేళ్ల వ్యవధిలో నిర్మాణాన్ని పూర్తిచేసి ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను ఆ సంస్థ నిర్వహించాల్సి వుంది.

**తొలిదశలో 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు**

తొలిదశలో భాగంగా ఏటా 60లక్షల మంది(ఆరు మిలియన్ల) ప్రయాణీకులు ఈ ఎయిర్‌పోర్టు ద్వారా ప్రయాణాలు సాగించేలా రూపొందిస్తున్నారు. ఆ తర్వాత దశల్లో ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ప్రతి ఏటా 4 కోట్ల (40 మిలియన్ల) ప్రయాణీకులు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఎయిర్‌పోర్టును అభివద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఎయిర్‌పోర్టులో ఎంతో కీలకమైన రన్‌వే 3.8 కిలోమీటర్ల పొడవుతో ఏర్పాటు చేస్తున్నారు.

# ఎయిర్‌పోర్టుతో ఉపాధి అవకాశాలు

- అన్ని అనుమతులూ వచ్చాకే శంకుస్థాపన
- జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో ఈ ప్రాంత యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సిఎం పర్యటన ఏర్పాట్లను సోమవారం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్.పి. దీపిక, జెసి మయూర్ అశోక్‌తో కలసి పరిశీలించారు. రూ.4,500 కోట్లతో ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేయడంతో సహా, రూ.194 కోట్లతో తారకరామ తీర్థసాగరం పెండింగ్ పనులకు, మత్స్యకార చిరకాల వాంఛ అయిన ఫిషింగ్ జెట్టీ నిర్మాణానికి రూ.23.74 కోట్లతో సిఎం శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల తరహాలో కాకుండా భోగాపురం ఎయిర్‌పోర్టు భూసేకరణకు సంబంధించి కోర్టుల్లో వున్న వివాదాలన్నీ పరిష్కరించి, అవసరమైన అన్ని అనుమతులూ సాధించాకే సిఎం శంకుస్థాపన చేస్తున్నామని తెలిపారు.

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సిఎం పర్యటన కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎస్‌పి ఎం.దీపిక మాట్లాడుతూ సభావేదిక జాతీయ రహదారిని ఆనుకొని వున్న కారణంగా ఈ కార్యక్రమం వల్ల వాహనాలకు ఇబ్బందులు కలగకుండా నాతవలస నుంచి రాజాపులోవ వరకు 200 మంది పోలీసు సిబ్బందితో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మూవింగ్ పార్టీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, జిఎంఆర్. సంస్థ సిఇఒ మన్మోయ్, ప్రాజెక్టు హెడ్ రామరాజు, అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై సూచనలిస్తున్న సిఎం కార్యక్రమాల సమన్వయకర్త రఘురాం

# పిల్లలు స్థిరపడినప్పుడే తల్లిదండ్రులకు ఆనందం

## డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారని.. వారు ప్రయోజకులై అనుకున్న లక్ష్యాలను అందుకున్న తర్వాతే ఆనందపడతారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. స్థానిక పూల్‌బాగ్‌లోని ఎంఆర్‌ఎజిఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా పూర్తి చేసుకున్న 50 మంది విద్యార్థులు వివిధ సంస్థలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి నియామక పత్రాలను కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కోలగట్ల అందజేశారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య జాయింట్ సెక్రటరీ జానకిరామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఆశా రమణి, శిక్షణ ప్లేస్‌మెంట్ అధికారి సివి రమణమూర్తి, స్టూడెంట్ అడ్వయిజర్ ఎస్‌వి రమణ, కార్పొరేటర్ బి.ఆనంద్ పాల్గొన్నారు.

**మహిళా సాధికారికతకు కృషి**

మహిళా సాధికారికతకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో భారత్ డైనమిక్ లిమిటెడ్ సహకారంతో ఫ్యాషన్ టెక్నాలజీపై మహిళలకు మూడు నెలల పాటు ఉచిత ఉపాధి శిక్షణ అందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను కోలగట్ల సోమవారం అందజేశారు. అనంతరం రెండో బ్యాచ్ శిక్షణ అభ్యర్థులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎపిఎం ఎస్.అరుణ, టి.కృష్ణవేణి, శిక్షకురాలు పి. ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

**21వ డివిజన్‌లో కోలగట్ల పర్యటన**

గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా 21డివిజన్‌లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. స్థానిక సమస్యలను వెనువెంటనే పరిష్కరించారు. మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ కనకల నాగవల్లి, కె.తవిటి రాజు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, జోనల్ ఇంఛార్జి కాళ్ల సూరిబాబు, డివిజన్ ఇంఛార్జి కనకల గిరి పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించారు. వాచ్‌మెన్ అప్రమత్తంగా వ్యవహరించడంతో 108వాహనంలో స్థానిక సర్వజన ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం. పోలీసులు, జిల్లా కలెక్టరేట్ అధికారుల కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రం రాయగడకు సమీపంలోని బిలంగపదర్ గ్రామానికి చెందిన వీర్‌కుమార్ ఉదయం 8:30గంటల ప్రాంతంలో కలెక్టరేట్ ప్రాంగణంలోని ఔట్‌గేట్‌కు ఎదురుగావున్న కలెక్టరేట్ భవనం అంచున గాజుపెంకుతో గొంతు కోసుకున్నాడు. అప్రమత్తమైన వాచ్‌మెన్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెంటనే 108వాహనాన్ని రప్పించి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర విభాగంలో చేర్పించి వైద్యసేవలు అందించారు. కొన్ని గంటల వ్యవధిలో తేరుకున్న క్షతగాత్రుడు ఆసుపత్రి నుంచి బయటకు వచ్చి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు తిరిగి ఆసుపత్రి లోపలికి తీసుకొచ్చి చికిత్సను కొనసాగించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి మతిస్థిమితం లేదని వైద్యులు, అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తరపున డిఆర్ఒ గణపతిరావు కూడా ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌లో జరుగుతున్న స్పందన కార్యక్రమానికి వచ్చిన వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసినట్టుగా వచ్చిన వార్తలను ఖండించారు. స్పందన కార్యక్రమంతో బాధితుడికి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి

# 'స్పందన'కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 80 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 48 ఉన్నాయి. హౌసింగ్‌కు 3, వైద్య ఆరోగ్య శాఖకు 6, గ్రామ, వార్డు సచివాలయాలకు 12, డిఆర్‌డిఎకు 3 కాగా మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. డిఆర్ఒ గణపతిరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

**'స్పందన' ఫిర్యాదులపై తక్షణ చర్యలు**

**విజయనగరం :** స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు దిశా మహిళా స్టేషన్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. స్పందనలో పలువురు బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వెంటనే పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు.

**ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం**

**విజయనగరం టౌన్ :** ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు కార్యదర్శులు చిత్తశుద్ధితో పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు స్పష్టం చేశారు. సోమవారం సచివాలయాల కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలతో మమేకమై, మెరుగైన సేవలందించాలన్నారు. హెల్త్ సెక్రటరీలు ఉదయం 5 నుండే తమ విధులను నిర్వర్తించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులు 500 అందగా వాటిలో ఎక్కువ శాతం టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం పైనే ఉన్నాయని అన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఎసిపి మధుసూదన్‌రావు, ఇఇ శ్రీనివాసరావు, టిపిఆర్ఒ సింహాచలం, డిఇ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ గణపతిరావు

## విద్యార్థులపై మేట్రిన్ వేధింపులు

**విజయనగరం టౌన్ :** విద్యార్థులను వేధిస్తున్న ఎస్‌సి బాలికల హాస్టల్ 2 మేట్రిన్ నాగమణిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అధికారులను కోరారు. సోమవారం స్పందనలో డిఆర్ఒ గణపతి రావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్.ఎఫ్.ఐ నగర కార్యదర్శి పి.రమేష్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇంటెన్షిప్ ఉన్న నేపథ్యంలో హాస్టల్ గడువు పెంచాలని గతంలో కలెక్టర్, డిడిలను కోరామని తెలిపారు. ఈ విషయం తెలిసిన విద్యార్థినులు హాస్టల్‌కు వస్తున్న నేపథ్యంలో వారిని భయపెట్టి వాళ్లతో మేట్రిన్ ఇష్టానుసారం మాట్లాడారని తెలిపారు. రెండు రోజులకు పైగా భోజన సదుపాయాలు కల్పించకుండా ఇబ్బంది పెట్టారని తెలిపారు. ఈ నేపథ్యంలో మేట్రిన్‌పై చర్యలు తీసుకుంటామని డిఆర్ఒ హామీ ఇచ్చారు. వినతినిచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్, సోమేష్ పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ సేవలు అందించాలి

**విజయనగరం కోట :** ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు అందేలా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక కలెక్టరేట్లో గ్రీవెన్స్‌కు ఆరోజు సేవలు కొనసాగించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు,పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కనకల మురళీమోహన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు చికిత్స అందిస్తున్న ఆసుపత్రుల యాజమాన్యాలు తమకు చాలాకాలంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి బిల్లులు రాకపోవడం వలన మే 1వ తేదీ నుండి ఆరోగ్య శ్రీ సేవలు నిలుపుదల చేస్తామని ప్రకటించారని తెలిపారు. ఈ విషయం తెలిసిన నుంచి పేదలు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బంగారు బాబు, కర్రోతి నర్సింగరావు, రాజు పాల్గొన్నారు.

## క్రీడా మైదానంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**విజయనగరం టౌన్ :** క్రీడా మైదానంలో మున్సిపల్ పార్కుల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సోమవారం డిఆర్ఒ గణపతిరావుకు సోమవారం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి హెచ్. హరీష్, ఎన్. రుద్ర ప్రసాద్ వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలో ఉన్న క్రీడా మైదానాలు, మున్సిపల్ పార్కుల్లో తాగునీరు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. నగరంలో ఉన్నటువంటి క్రీడామైదానంలో దాదాపు 300 మంది కి పైగా నిరుద్యోగి యువత ,పెద్దవాళ్లు ,చిన్నపిల్లలు, ఆడవారు, క్రీడాకారులు వస్తూ ఉంటారని, వారికి కనీసం మౌలిక సదుపాయాలు లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి క్రీడా మైదానంలో మున్సిపల్ పార్కులలో తాగునీటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ సభ్యులు జగదీష్, సోమేష్ పాల్గొన్నారు.



చిట్టిబాబును సన్మానిస్తున్న పివిజిరాజు స్మారక వేదిక సభ్యులు

## చిట్టిబాబుకు పివిజి రాజు స్మారక పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం

డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబుకు డాక్టర్ పివిజి రాజు స్మారక పురస్కారం లభించింది. పివిజి రాజు శత జయంతి సందర్భంగా సోమవారం గురజాడ స్కూలు జరిగిన కార్యక్రమంలో చిట్టిబాబుకు ఈపురస్కారాన్ని పివిజి రాజు స్మారక వేదిక చైర్మన్ భీశెట్టిబాబ్జీ, రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు, ఎంవిఎన్ వెంకటరావు తదితరులు అందజేశారు. అణగారిన వర్గాల పట్ల నిరంతరం శ్రమిస్తున్న కార్మిక ఉద్యమకారుడు, దళిత ఆదివాసీల హక్కుల, బాలల హక్కుల కోసం పోరాడిన చిట్టిబాబుకు ఈ పురస్కారం ఇవ్వడం ఎంతయినా ముదావహమని అన్నారు. చట్టాలపై అవగాహ కార్యక్రమాలతో భారత రాజ్యాంగంలోని కీలకమైన అంశాలను బోధిస్తూ,సమీకరిస్తూ, అనేక మానవ హక్కుల ఉద్యమాల వైపు దారి చూపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

## ఘనంగా తొలేళ్ల ఉత్సవం

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి దాడితల్లి గ్రామదేవత పండగ సందర్భంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దాడితల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లపల్లి, బొబ్బిలిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దాడితల్లి అమ్మవారికి చీర, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు పి.మణికుమార్ శర్మ పూజలు చేశారు.

**సిరిమానోత్సవానికి పటిష్ట చర్యలు**

సిరిమానోత్సవం సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. సిరిమానోత్సవం జరిగే ప్రాంతాన్ని సోమవారం మున్సిపల్ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లపల్లి, బొబ్బిలిలో సజావుగా సిరిమానోత్సవం నిర్వహించేలా చూడాలన్నారు. సిరిమాను తిరిగే ప్రాంతంలో రోడ్డుపై, కాలువలపై ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, అధికారులు ఉన్నారు.

## 108లో ప్రసవం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని రాజుల గుమ్మడ గ్రామానికి చెందిన వావిలపల్లి సంధ్య( 25)కు ఆదివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న ఈఎంటి రాజారావు, పైలట్ అనిల్ కుమార్ గర్భిణిని మన్యం జిల్లా పార్వతీపురంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కకు నిలిపి ఆశా కార్యకర్త జయమ్మ సహకారంతో ఈఎంటి రాజారావు ప్రసవం చేయించడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం అక్కడ నుండి పార్వతిపురంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రసవం సక్రమంగా జరగడంతో సంధ్య కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేసి 108 సిబ్బందిని అభినందించారు.

## విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో పరీక్ష రాసి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. ఈ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రామకృష్ణారావును అభినందిస్తున్న జనార్ధనరావు, తదితరులు

## 175వ సారి రామకృష్ణారావు రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం

కార్మిక, శ్రామిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో అత్యధికంగా 175వ సారి స్వచ్ఛందరక్తదాత బొడ్డేపల్లి రామకృష్ణారావు సోమవారం రక్తదానం చేశారు. మేడేను పురస్కరించుకొని స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో ఉపాధ్యాయుడు రామకృష్ణారావు రక్తదానం చేసి రికార్డు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను అంతర్జాతీయ మానవహక్కుల సంఘం(ఇండియా) జిల్లా అధ్యక్షులు పేడాడ జనార్ధనరావు తదితరులు అభినందించారు.



సచివాలయ పరిశీలనలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్

## సింగరాయి సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సోమవారం సందర్శించారు. సచివాలయ సిబ్బంది పనితీరు, అమలు చేస్తున్న పథకాలు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది తప్పనిసరిగా యూనిఫారం ధరించాలని ఆదేశించారు. సచివాలయానికి పనిపై వచ్చిన ప్రజలతో సోదర భావం కలిగి ఉండి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి కర్ణంనాయుడు, ఎంపిటిసి పాల్గొన్నారు.

## ఘనంగా పివిజి రాజు జయంతి

ప్రజాశక్తి - విజయనగరం కోట

విద్యావేత్త, రాజసాహెబ్ డాక్టర్ పివిజి రాజు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ప్రసాదుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాసన్నపేట, నవాబుపేట జంక్షన్ లో వున్న పివిజి రాజు విగ్రహానికి టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాదుల లక్ష్మి వర ప్రసాద్, అల్తి బంగారు బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. విజయనగరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గంటా రవి తదితరులు హాజరయ్యారు. తమ సొంత ఆస్తులను విద్యా సంస్థలకు ఇచ్చి విద్యా వ్యాప్తికి ఎంతో కృషి చేశారని కొనియాడారు.

# మేడే స్ఫూర్తితో హక్కుల సాధన

ప్రజాశక్తి-బొబ్బిలి

స్ఫూర్తితో కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. మేడే సందర్భంగా మున్సిపల్, సిఐటియు కార్యాలయాల వద్ద ఎర్ర జెండాను ఆయన ఎగురవేశారు. జెండామాల్ జంక్షన్‌లో ఎఐటియుసి జెండాను కండాపు ప్రసాదరావు, పట్టణ కళాసీ సంఘం కార్యాలయం వద్ద ఎర్ర జెండాను బోగాది అప్పలస్వామి ఎగురవేశారు. సివిల్ సరఫరాల గోదాం వద్ద జెండాను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు.

**శృంగవరపుకోట :** మండలంలోని వెంకటరమణపేటలో క్వారీ కార్మికులు, కార్పెంటర్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అప్పలసూరి జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లాకమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, క్వారీ కార్మికుల యూనియన్ నాయకులు ఎర్రప్రగడ భాస్కరరావు, పోకల భాస్కరరావు, గోకాడ శ్రీను, ఎస్.రామసత్యం, జి.కృష్ణ, బి.మహేష్ పాల్గొన్నారు. ఎస్.కోట గ్రామ పంచాయతీ కార్యాలయం, ఏరియా ఆస్పత్రి, ఆటో స్టాండ్, భవాని ఐటిఐ వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ జెండావిష్కరణ చేశారు.

**నెల్లిమర్ల :** మేడే స్ఫూర్తిగా కార్మికులు హక్కులు సాధించుకోవాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టివి రమణ పిలుపునిచ్చారు. సోమవారం137వ ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను సిఐటియు ఆధ్వర్యంలో నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద హమాలీ సంఘం ఆధ్వర్యంలో మేడే పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ బి. సుధారాణి, సిఐటియు మండల కార్యదర్శి అరసాడ నారాయణ రావు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి.బాబూ రావు, అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పల్లె మంగలక్ష్మీ, ఆర్. జయ, ఎండిఎం నాయకులు, చందక అప్పల నారయణ, హమాలీ సంఘం నాయకులు కెల్ల గోవింద, మీసాల లెనిన్, పతివాడ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

**రాజాం:** రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ దరి సిఐటియు ఆధ్వర్యంలో మేడే జెండాను ముద్దాడ అప్పడు ఆవిష్కరణ చేసారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు మాట్లాడుతూ కార్మిక వర్గం ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రామునాయుడు, మున్సిపల్ యూనియన్ నాయకులు సోమేశ, హరి, కార్మికులు పాల్గొన్నారు

**లక్కవరపుకోట :** మండల కూడలిలో హాస్టల్ జంక్షన్‌లో సిఐటియు స్థూపం వద్ద యూనియన్ మండల కార్యదర్శి తరిని వెంకటరమణ ఎర్ర జెండాను ఆవిష్కరించారు.

**గజపతినగరం :** పంచాయతీ కార్యాలయ ఆవరణలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.కృష్ణ, సీనియర్ కార్మికులు జి.శర్మ జెండా ఆవిష్కరించారు. సిఐటియు పూర్వ నాయకులు జి.శ్రీనివాస్, శర్మ, అప్పలరాజు, కృష్ణ, కనకరాజు, గోవిందు, యేసు పాల్గొన్నారు.

**రామభద్రపురం :** స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద కార్మిక జెండాను సిఐటియు మండల కన్వీనర్ బలస శ్రీను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సత్యవతి, రాధ, అరుణ, రమణి, శాంత కుమారి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

**కొత్తవలస :** కొత్తవలస ఆటో స్టాండ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు జెండా ఆవిష్కరించారు.

**వేపాడ :** మండలంలోని సోంపురం క్వారీల వద్ద, బొద్దాం నాలుగు రోడ్ల జంక్షన్‌లో వేపాడలో సిపిఎం నాయకులు సిహెచ్.జగన్ ఆధ్వర్యాన ఎర్రజెండాను ఎగురవేశారు.



ఎల్‌బిజి భవనం వద్ద జెండా వందనం చేస్తున్న సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ఎల్.వెంకటరమణ, చంద్రయ్య, అప్పలనాయుడు, పాలు శ్రీను, ఆటో యూనియన్ నాయకులు గోవింద, శంకర్ పాల్గొన్నారు.

**దత్తిరాజేరు :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం, కోమటిపల్లి ఆటోస్టాండ్ వద్ద సిఐటియు నాయకులు పి.జ్యోతి, బి.అప్పలనాయుడు జెండావిష్కరణ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శి మూర్తి, పద్మ, నూకరాజు, లక్ష్మి, ఎస్.గౌరీశ్వరి, సూర్యనారాయణ, గౌరీశంకర్, రాము, నాగరాజు, బాబ్జి పాల్గొన్నారు.

**చైతన్య పతాకానికి జేజేలు**


**బొబ్బిలి :** స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్ద ఫెడరేషన్ జెండాను ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో రాజ్యాంగాన్ని మేడే స్ఫూర్తితో కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేశవరావు, సత్యనారాయణ, బొబ్బిలి, రామభద్రపురం, మక్కువ మండల ప్రధాన కార్యదర్శులు బత్తుల శ్రీనివాస్, శంకరరావు, రామకృష్ణ, కృష్ణదాసు, రాము, మధుసూదనరావు, శంకరరావు పాల్గొన్నారు.

**కార్మికశాఖ ఆధ్వర్యాన...**

మేడే ఉత్సవాలను కార్మికశాఖ ఆధ్వర్యాన రోటరీక్లబ్‌లో నిర్వహించారు. డిఎల్ఎస్ఎ కార్యదర్శి కె.నాగమణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప కార్మిక కమిషనర్ ఎన్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు రక్తదానం చేశారు. వీరికి డిఎల్ఎస్ కార్యదర్శి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.




నెల్లిమర్ల : మేడే వేడుకల్లో పాల్గొన్న సిఐటియు నాయకులు టివి రమణ, కార్మికులు



రాజాం, ఎస్.కోట, గజపతినగరంలో జెండా ఎగురవేస్తున్న పి.శంకర్రావు, మద్దిల రమణ, బి.కృష్ణ : పాల్గొన్న కార్మికులు




రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కార్మిక శాఖ అధికారి


# జగనాసుర పాలనను అంతమొందించాలి

ప్రజాశక్తి-కొత్తవలస

మోడరన్ డే రావణుడు జగనాసురుడంటూ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి.. సిఎం జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం కొత్తవలసలోని టిడిపి కార్యాలయం వద్ద రావణుడి 10 తలలను సూచించేలా 10 ప్రతికూల ట్యాగులతో కూడిన సిఎం జగన్ ఫ్లెక్సీని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతి నేరాలు రాక్షసుడన్నారు. జగన్ నాలుగేళ్ల పాలనలో ఎక్కడ చూసినా విపరీతంగా నేరాలు, అవినీతి, దాడులు, అక్రమాలు, అల్లర్లు, గొడవలు, మతాల మధ్య, ప్రాంతాల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీటన్నింటినీ చూస్తుంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిరి రాష్ట్ర నాయకులు కెబిఎ రాంప్రసాద్, నాయకులు బొబ్బిలి అప్పారావు, కోళ్ల వెంకటరమణ(శ్రీను), ఎల్లపు సూరిబాబు, కనకాల శివ, బంగారు రమేష్, విరోతి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల :** రాష్ట్రంలో జగనాసుర పాలనను అంతమొందించాలని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగార్రాజు పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయంలో జగనాసుర కార్యక్రమం నిర్వహించి పది తలల జగనాసుర దిష్టి బొమ్మను టిడిపి శ్రేణులు దగ్ధం చేశాయి. ఈ సంధర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలన రాక్షస పాలనను తలపిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ రావు, జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, భోగాపురం, పూసపాటిరేగ మండల అధ్యక్షులు కర్రోతు సత్య నారాయణ, మహంతి శంకరరావు, నాయకులు లెంక అప్పల నాయుడు, పోతల రాజప్పన్న, బైరెడ్డి లీలావతి, అవనాపు సత్యనారాయణ, ఆకిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**పది తలల జగన్ ఫెక్సీ ధ్వంసం**



పది తలల జగనాసుర దిష్టిబొమ్మను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం షటిల్ బాడ్మింటన్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడా శిక్షణ శిబిరాలను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫోన్లు, ట్యాబులతో సమయం గడపకుండా క్రీడా మైదానాల్లో ఆటలు ఆడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే శిక్షణ శిబిరంలో 70 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. దాతల సహకారంతో నిర్వహించే శిబిరంలో ఉదయం పోషకాహారంగా పాలు, గుడ్లు అందిస్తారని తెలిపారు. క్రీడాకారులందరికీ క్రీడా దుస్తులను కూడా అందిస్తారన్నారు. తన వంతుగా శిక్షణ శిబిరం చివరిలో టోర్నమెంట్ పెట్టి గెలుపొందిన క్రీడాకారులకు రూ.15 వేల విలువైన షీల్డులను అందిస్తానని ప్రకటించారు. శిబిరానికి చీఫ్ కోచ్‌గా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పొట్నూరు శ్రీరాములు వ్యవహరిస్తారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎంపిటిసి కనకమహాలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ తగరంపూడి రమణ, తాజా, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో పండగ సందడి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో సోమవారం పైడితల్లమ్మ పండగ సందడి నెలకొంది. తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఘటాలను వాయిద్యాల నడుమ ఊరేగించారు. మంగళవారం అమ్మవారి అనుపోత్సవంతో పండగ ముగియనుంది. సర్పంచ్ వంటాకు రాములమ్మ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు.

## రోడ్డుపైకి మురుగునీరు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో ఏ మాత్రం వర్షం వచ్చినా రోడ్లపైకి మురుగునీరు చేరుతోంది. గ్రామంలో ఏర్పాటు చేసిన సిసి రోడ్లకు ఇరువైపులా సరైన కాలువలు నిర్మించకపోవడంతో వర్షానికి వచ్చే మురుగునీరంతా రోడ్డుపైకి చేరుతోంది. దీంతో ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతోంది. వెంటనే అధికారులు స్పందించి, కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కుట్టు శిక్షణతో జీవనోపాధి

ప్రజాశక్తి-గజపతినగరం

గృహిణులు కుట్టు శిక్షణ తీసుకొని జీవనోపాధి మెరుగు పరుచుకోవాలని ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో కుట్టు శిక్షణను తీసుకున్న మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం ఏటా టైలరింగ్ వృత్తిని ఎంచుకున్న వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ రూ.10 వేలు అందిస్తోందన్నారు. అనంతరం మొదటి బ్యాచ్ వారికి సర్టిఫికెట్లు, రెండో బ్యాచ్ వారికి కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ జె.లక్ష్మంనాయుడు, సర్పంచులు బెల్లాన త్రినాథరావు, ఎస్.విజయలక్ష్మి, జిల్లా రిసోర్స్ పర్సన్ కృష్ణవేణి, ఎపిఎంలు ఇందిరాదేవి, ఎస్.సత్యవతి, యు.జగదీశ్ కుమార్, మాస్టర్ ట్రైనర్స్ విజయలక్ష్మి, గౌరీ పాల్గొన్నారు.

## తైక్వాండో శిక్షణ శిబిరాలు ప్రారంభం

**బొబ్బిలి :** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో తైక్వాండో శిక్షణ శిబిరాలను ప్రారంభించినట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. విజేత, సురేష్ స్కూళ్ల వద్ద ఈ శిబిరాలను సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 7780760504 నంబరును సంప్రదించాలని కోరారు.

## కార్మిక నేత బోగాదికి సన్మానం

**బొబ్బిలి :** కార్మిక సమస్యలు పరిష్కారానికి అహర్నిశలు కృషిచేసిన పట్టణ కళాసీ సంఘం అధ్యక్షులు బోగాది అప్పలస్వామిని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం అప్పలస్వామి చేస్తున్న పోరాటం వెలకట్టలేనిదని చెప్పారు. మేడే సందర్భంగా అప్పలస్వామిని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

## క్రాష్ ప్రోగ్రాం ప్రారంభం

**శృంగవరపుకోట :** మండలంలోని సమ్మర్ క్రాష్‌ప్రోగ్రాం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ రఘురాజు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 50 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సాధారణ నిధులతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## పేద క్షత్రియ కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి -భోగాపురం

పేద క్షత్రియ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామని శ్రీ విజయ రామ గజపతి క్షత్రియ సేవా సమితి జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయించింది. భోగాపురం గ్రామంలోని కంచేరు సమీపంలో ఉన్న కాకర్లపూడి శ్రీనివాసరాజుకు చెందిన ఆనంద రూపం అతిథి గృహంలో సోమవారం సేవాసమితి ముఖ్య సలహాదారు కాకర్లపూడి శ్రీనివాసరాజు, అధ్యక్షులు నల్లపురాజు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ముఖ్యంగా వైద్య పరంగా ఆర్థిక సహాయం, విద్యార్థులకు ఉపకార వేతనాలు, వివాహాలకు ఆర్థికపరమైన సహాయం అందజేస్తామని తెలిపారు. ఇటీవలి మృతి చెందిన జిల్లా క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు దంతులూరి సింగుబాబు మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో సేవాసమితి సభ్యులు దంతులూరి సూర్యనారాయణ రాజు, పాకలపాటి రామభద్ర రాజు, కాకర్లపూడి నారాయణమూర్తి రాజు, దంతులూరి రావాడ బాబు, వాసుదేవ వర్మ, భోగాపురం పూసపాటిరేగ, డెంకాడ మండలాలతోపాటు భీమిలి మండలాలకు చెందిన క్షత్రియ పెద్దలు పాల్గొన్నారు



సింగుబాబు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న క్షత్రియ సేవా సమితి సభ్యులు

## సిఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- డెంకాడ

ఈ నెల మూడున భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపన తరువాత సవరవిల్లి వద్ద ఏర్పాటు చేయనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు ఎంపిటిసిలు, వైసిపి నాయకులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజవర్గం నుంచి సుమారుగా 45 వేల మందిని బహిరంగ సభకు తరలిస్తున్నామని చెప్పారు. వీరి కోసం 450 బస్సులు 2వేల ఆటోలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డెంకాడ మండలం నుంచి 94 బస్సులు 380 ఆటోలు బహిరంగ సభకు ప్రజలు తరలించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి మండల నుంచి పదివేలు మందికి తగ్గకుండా ప్రజల హాజరుకావాలని సూచించారు. సమావేశంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ ఫలాలు

### ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలంలోని చీడివలస గ్రామంలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ ఇన్‌ఛార్జి బొంతుల వెంకటరావు, సర్పంచ్ నెక్కల గౌరినాయుడు, వైస్ సర్పంచ్ కందా దుర్గారావు, ఎంపిటిసి లెంక వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదానికి ముగింపు పలకాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశంలో పేరుకుపోతున్న మతోన్మాదానికి ముగింపు పలికి లౌకిక భావాన్ని వ్యాపింపజేయాలని భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి భాస్కరరావు, కార్యదర్శి దుడ్డు ప్రభాకర్ కోరారు. సోమవారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద గల అంబేద్కర్ భవనంలో భారత్ బచావో జిల్లా సమావేశం రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా కో కన్వీనర్‌గా పికె రామారావు, అబ్దుల్ రహీం, ఆనంద్, షణ్ముఖరావు ఫ్రాన్సిస్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా తల స్వామి, అశోక్ కుమార్, దుర్గారావు, వెంకట్రావు, అప్పారావు, బంగార్రాజు, షరీఫ్, షేక్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ గ్రామ గ్రామాన భారత్ బచావో లక్ష్యాలను ప్రజలకు వివరించి రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని లౌకిక తత్వాన్ని దేశాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

## .ప్రారంభమైన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- డెంకాడ

ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు సోమవారం నుంచి డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సుమారు రెండు వారాలు పాటు జరిగే ఈ తరగతులను ఫెయిలైన విద్యార్థులు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎం. ఆదినారాయణ రావు కోరారు. సప్లీమెంటరీ పరీక్షలకు ఈ నెల 3లోగా ఫీజు చెల్లించాలన్నారు.

## పాఠశాలలో సరస్వతీ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లి ఎంపిపి పాఠశాలలో సోమవారం సరస్వతీ దేవి విగ్రహాన్ని ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు, సర్పంచ్ పిన్నింటి చిన అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లడుతూ గ్రామంలో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకొని గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చందక అప్పలనాయుడు, ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, రిటైర్డ్ హెచ్ఎం కురుమునేని రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ పాలూరి తిరుపతిరావు, మాజీ ఎంపిటిసి కురుమునేని గురునాయుడు, వార్డ్ మెంబర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న వాలంటీర్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరుకు చెందిన గొర్లు ఈశ్వరమ్మ విశాఖలో కంటి శస్త్రచికిత్స చేసుకుని అక్కడే ఆస్పత్రిలో ఉన్నారు. ఆమె వాలంటీర్ శివ తన సొంత డబ్బులతో విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి ఆమె పింఛను డబ్బులను సోమవారం అందజేశారు. శివను సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ నాయకులు అప్పలనాయుడు అభినందించారు.